క్లుప్తంగా

23న మున్నార్‌కు ప్రత్యేక బస్సు సర్వీసు

మదనపల్లె సిటీ: కేరళలోని మున్నార్‌కు ఈనెల 23న ప్రత్యేక స్పెషల్ బస్సు నడుపుతున్నట్లు ఆర్టీసీ–2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. 23న రాత్రి మదనపల్లెలో బయలుదేరి మున్నార్‌లోని ప్రదేశాలు, రవికులం నేషనల్ పార్కు, ఈశా టెంపుల్,లేజర్ షో చూపించడం జరుగుతుందన్నారు. టూర్‌కు వెళ్లేవారు టిక్కెట్లు ముందుగా బుక్ చేసుకోవాలన్నారు. టిక్కెట్టు ధర రూ.2500 చెల్లించాలన్నారు. మరిని వివరాలకు 9959225677, 9160186645 సంప్రదించవచ్చునన్నారు.

రాయల్ క్రాఫ్ట్ బజార్ ప్రారంభం

మదనపల్లె సిటీ: స్థానిక పుంగనూరు రోడ్డులోని మిషన్ కాంపౌండ్‌లో రాయల్ క్రాఫ్ట్ బజార్‌ను ప్రారంభించారు. ఇందులో కలంకారి శారీస్, వరంగల్ టవల్స్, కొండపల్లి బొమ్మలు, బెంగాల్ శారీస్, హైదరాబాద్ పెరల్స్, శారీస్, సహరన్ పూర్ ఉడ్ లాకర్స్ వేర్స్, బొంబాయి ఫ్యాన్సీ జ్యువెలరీ ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. సరసమైన ధరలకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ క్రాఫ్ట్ బజార్ ఈనెల 17వరకు ఉంటుందన్నారు.

పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని వినతి

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి శనివారం జెడ్పీ కోఆప్టెడ్ సభ్యుడు షఫీ విన్నవించారు. మంత్రిని తిరుపతిలో కలసి పంచాయతీలోని సమస్యల గురించి వివరించారు. పట్టణంలో పలుచోట్ల మురుగునీటి కాలువలు, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. సానుకూలంగా స్పందించిన మంత్రి తమ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

ఆటోలో నుంచి పడి మహిళకు గాయాలు

మదనపల్లె : ఆటోలో నుంచి ప్రమాదవశాత్తు పడి ఓ మహిళ గాయపడిన సంఘటన శనివారం మదనపల్లె మండలంలో చోటుచేసుకుంది. కురబలకోట మండలం సందిరెడ్డిగారిపల్లెకు చెందిన అమానుల్లా భార్య ఎస్.ఉన్నీబీ(30) ఆటోలో వస్తూ ప్రమాదవశాత్తు చేనేత నగర్ వద్ద గాయపడింది. గాయపడ్డ ఆమెను స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

11న మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: కార్తీకచివరి మాసం పురస్కరించుకుని ప్రముఖ శైవక్షేత్రం మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. నాలుగు బస్సులు మదనపల్లె నుంచి బయలుదేరి తంబళ్లపల్లె చేరుకుంటాయన్నారు. అక్కడి రాగిమాను సర్కిల్ నుంచి మల్లయ్యకొండకు షటిల్ తిరుగుతాయన్నారు. మదనపల్లె నుంచి ఉదయం 5.30, 6.30, 7.30 గంటలకు బయలుదేరుతాయన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

నాటుసారా స్వాధీనం

పెద్దమండ్యం: నాటుసారా స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయుడు శనివారం తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పాపేపల్లెలో నాటుసారా తయారీ, విక్రయాలపై అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడుల్లో గ్రామానికి చెందిన సిరివెళ్ల నరసింహులు (53) వద్ద 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. గ్రామాలలో ఎక్కడైనా నాటుసారా తయారీ, విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రెడ్డి కమ్యూనిటీ అభివృద్ధికి కృషి

మదనపల్లె : రెడ్డి కమ్యూనిటీ అభివృద్ధికి కృషిచేస్తూ, పేద రెడ్లకు సహాయ సహకారాలతో పాటుగా రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ(ఆర్‌సీడీఎస్) ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేస్తామని రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఎర్రగుంట్ల పద్మప్రియారెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన ఎర్రగుంట్ల పద్మప్రియారెడ్డిని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ అధ్యక్షులు కాలువ శ్రీలతరెడ్డి శనివారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎర్రగుంట్ల పద్మప్రియారెడ్డి మాట్లాడుతూ... రెడ్డి కమ్యూనిటీకి సహాయం చేయాలనే సంకల్పంతో స్థాపించిన సొసైటీకి ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాల్సిందిగా కోరారు.

విద్యార్థులు ఉన్నతాశయంతో చదవాలి

పీలేరు : విద్యార్థులు ఉన్నతాశయంతో చదవాలని ఎంజేఆర్ కళాశాల ఛైర్మన్ ఎం.పి. అవినాష్‌రెడ్డి అన్నారు. శనివారం ఎంజేఆర్ కళాశాల ఫ్రెషర్స్ డే 2కే23 ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ అంతర్జాతీయ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సినీ నటుడు సంపూర్ణేష్‌బాబు విద్యార్థులతో కలసి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

కేసుల పరిష్కారానికే లోక్‌అదాలత్

- రెండో ఏడీజే అబ్రహాం
- జాతీయలోక్ అదాలత్‌లో 1,113 కేసులు పరిష్కారం
- కక్షిదారులకు రూ.3.16 కోట్ల పరిహారం చెల్లింపు



జాతీయలోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి అబ్రహాం

మదనపల్లె : కోర్టు కేసులను కక్షిదారులు సహృద్భావ వాతావరణంలో, సామరస్యంగా పరిష్కరించుకునేందుకే సెక్షన్ 19 ప్రకారం లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్–1987 ద్వారా లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, రెండో ఏడీజే అబ్రహాం అన్నారు. శనివారం జాతీయ లోక్‌అదాలత్ దినోత్సవం సందర్భంగా స్థానిక కోర్టుభవన సముదాయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అన్ని రకాల కాంపౌండ్, క్రిమినల్, సివిల్, రెవెన్యూ కేసుల నుంచి సత్వర పరిష్కారం పొందవచ్చన్నారు. లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా కక్షిదారులు సమయం, డబ్బును ఆదా చేసుకోవచ్చన్నారు. తాము కోరుకున్న విధంగా న్యాయం పొందవచ్చన్నారు. లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం వల్ల కక్ష్యలు, గొడవలు లేకుండా స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించవచ్చన్నారు. సమస్యలను వారే పరిష్కరించుకునేందుకు లోక్‌అదాలత్ చక్కటి అవకాశం కల్పిస్తుందన్నారు. సెక్షన్ సీఆర్‌పీసీ 320 ప్రకారం చిన్నపాటి క్రిమినల్ కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకునేందుకు చట్టం అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమం ద్వారా పెండింగ్ కేసులు త్వరగా పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి డి.వెంకటేశ్వర్లునాయక్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష్, అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి జీ.సి.ఆసిఫా సుల్తానా, అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి ఐ.ప్రవీణ్‌కుమార్, స్పెషల్ మేజిస్ట్రేట్ ఎస్.వి.చలపతి, గ్రామజ్యోతి సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 1,113 కేసుల పరిష్కారం :

జాతీయలోక్‌అదాలత్‌లో భాగంగా శనివారం మదనపల్లె కోర్టు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో కేసుల పరిష్కారానికి నాలుగు బెంచీలను ఏర్పాటుచేశారు. ఇందులో సివిల్‌కు సంబంధించి 27, ఎంవిఓపీ..6, పీఎల్‌పీ..33, క్రిమినల్‌కు సంబంధించి 1,047 కేసులను పరిష్కరించారు. రూ.3కోట్ల16లక్షల రూపాయలు కక్షిదారులకు నష్టపరిహారంగా చెల్లించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, లోక్‌అదాలత్‌సభ్యులు, కక్షిదారులు వారి న్యాయవాదులతో సంప్రదింపులు జరిపి కేసులను పరిష్కరించారు. మెడికల్ క్యాంపును నిర్వహించారు.

395 కేసుల పరిష్కారం

తంబళ్లపల్లె: స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో శనివారం మండల న్యాయసేవసంఘం అధ్యక్షులు, స్థానిక న్యాయమూర్తి ఉమర్‌ఫరూఖ్ ఆధ్వర్యంలో మెగాలోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. న్యాయమూర్తి ఇరువర్గాల కక్షిదారుల సమ్మతి మేరకు అన్ని రకాల 395 కేసుల పరిష్కరించారు. కేసులకు సంబంధించి రూ.46,59,987ల ప్రాపర్టీని రికవరీ చేసి కక్షిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగమల్‌రెడ్డి, న్యాయవాదులు సిద్దలింగారెడ్డి, గఫార్, రామచంద్ర పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం

వాల్మీకిపురం: రాజీమార్గంతోనే దీర్ఘకాలిక కేసులకు పరిష్కారం దొరుకుతుందని, తద్వారా కక్షిదారులకు కేసుల నుంచి ఉపసమనం పొందవచ్చునని జూనియర్ సివిల్ ఇన్‌చార్జ్ జడ్జి గాయత్రి అన్నారు. శనివారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా సివిల్, క్రిమినల్, బ్యాంకు కేసులకు సంబంధించి 146 కేసులను ఒకే రోజులో పరిష్కరించారు. తద్వారా రూ.49,88,970 నగదును రికవరీ చేసినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ మెంబర్ వెంకటరెడ్డి, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

166 కేసులు పరిష్కారం

పీలేరు రూరల్ : స్థానిక కోర్టు ఆవరణలో జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 166 కేసులు పరిష్కరించి రూ. 5,23,97,450 రికవరీ చేసినట్లు సీనియర్ సివిల్ జడ్జి కె. రవి తెలిపారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, ఆర్థిక, ఎక్సైజ్, బ్యాంక్ తదితర కేసులు రాజీ మార్గంలో పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ మెంబరు సి. నాగరాజ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రఫీ అన్సారీ, న్యాయవాదులు చంద్రకుమార్ రెడ్డి, షౌకత్‌అలి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల సారథి వైఎస్ జగన్

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



సంక్షేమ లబ్ధిని తెలుయజేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలకడ : సంక్షేమ పథకాల సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని దేవులపల్లె, రాతిగుంటపల్లె పంచాయతీలలోని గ్రామాల్లో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి పర్యటించి ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఒంటరి వృద్ధులకు ఉన్న బియ్యం కార్డులు–6 తొలగింపుపై ఫిర్యాదులు అందాయి. వెంటనే స్పందనలో దరఖాస్తు చేయాలని అవసరమైతే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళి మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దేవులపల్లె హరిజనవాడలో రెండు వీధులకు సిమెంట్ రోడ్డు, నీటిపైప్‌లైన్ కోరగా మంజూరుకు అంచనాలు సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. దివ్యాంగులు నలుగురు బ్యాటరీ మూడు చక్రవాహనాలు కావాలని కోరారు. రిజిష్టర్ పత్రాలతో నిమిత్తం లేకుండా కొన్ని భూములు ఆన్‌లైన్ చేసినట్లు బాధితులు ఫిర్యాదు చేయగా వెంటనే పరిశీలించి రద్దు చేయాలని తహసీల్దార్ ప్రదీప్‌ను ఆదేశించారు. శ్రీనివాసపురంలోని ఇద్దరు రైతులకు అనుభవంలోని భూమిని ఆన్‌లైన్ చేయాలని కోరారు. దేవులపల్లె గ్రామదేవత యల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అదే గ్రామంలో తాగునీరు సమస్య ఉందని తెలిపిన గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు నూతన బోరు వేయడానికి అనుమతి మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో కలికిరి మార్కెట్‌కమిటీ మాజీ ఛైర్మన్ రవికుమార్‌రెడ్డి, ఎంపీపీ శ్రీదేవి, సింగల్‌విండో అధ్యక్షులు వెంకట్రమణరెడ్డి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసులు, సుబ్రమణ్యం, రెడ్డెప్పనాయుడు, వెంకట్రమణరెడ్డి, మద్దిపట్ల వెంకట్రమణనాయుడు, దొరస్వామి, హరినాథరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మాధవరెడ్డి, అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి శ్రీరామ పూజిత అక్షింతలు

పీలేరురూరల్ : ప్రతి గ్రామానికి శ్రీరామపూజిత అక్షింతలు చేర్చడానికి కృషి చేస్తామని విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతపర్తి మహేష్ అన్నారు. శనివారం మండలంలోని అన్ని పంచాయతీ శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ఆయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22, 24 తేదీల్లో ప్రతిపల్లెకు అక్షింతలు పంపిణీ చేస్తామన్నారు. జనవరి 22న ఆయోధ్య రామమందిరం ప్రారంభోత్సవానికి సంబంధించి జనవరి 1 నుంచి ఆహ్వాన కరపత్రాలు, రాములవారి చిత్రపటాలు, ప్రతి ఒక్కరికి అందిస్తామన్నారు.

ఘనంగా అయ్యప్ప గ్రామోత్సవం

మదనపల్లె సిటీ: స్థానిక అయ్యప్ప నగర్‌లో వెలిసిన అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణతో ఆలయ పరిసర ప్రాంతాలు మారుమోగాయి. ఆలయాన్ని ప్రత్యేక పుష్పాలు, రంగు రంగు విద్యుత్‌దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. గ్రామోత్సవంలో అయ్యప్పస్వామిని ప్రత్యేక వాహనంలో పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. మాలాధారులు, కళాకారులు చేసిన భజనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ సీ.రెడ్డప్పరెడ్డి, సభ్యులు రాజేష్, అంజనప్ప, సోము, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

మురళీధర్‌రాజుకు తెలుగు సేవా పురస్కారం

పీలేరు : పీలేరుకు చెందిన కవి మురళీధర్‌రాజుకు తెలుగు సేవా పురస్కారం లభించింది. శనివారం పలమనేరులోని సాయి గార్డెన్స్‌లో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి 11వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కవి మురళీధర్‌రాజుకు తెలుగుసేవా పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన భాషా వైభవ పద్య కవిత్వ, కవితలతో తెలుగు భాషా వైభవాన్ని వివరించారు.

గ్రామాల్లో నాటుసారాను కట్టడి చేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ రెడ్డెమ్మ

మదనపల్లె : మండలంలోని గ్రామాల్లో నాటుసారా విక్రయాలు జోరుగా జరుగుతున్నాయని, తయారీ, రవాణా, విక్రయాలపై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రెడ్డెమ్మ, ఏపీఎండీసీ డైరెక్టర్ ఆనందపార్థసారథి కోరారు. ఎంపీపీ రెడ్డెమ్మ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ గ్రామాల్లో నాటుసారా విక్రయాలు అధికమయ్యాయని ప్రస్తావించారు. దీనిపై ఎక్సైజ్‌శాఖ అధికారులను వివరణ ఇవ్వాలని ఎంపీపీ రెడ్డెమ్మ కోరితే... సమావేశానికి హాజరైన గోడౌన్ సిబ్బంది సమాధానం చెప్పడంలో తడబడ్డారు. దీంతో సభ్యులు మండల సమావేశానికి ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు రాకుండా గోడౌన్ సిబ్బందిని పంపడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని సీటీఎం, వైఎస్సార్ కాలనీ, బసినికొండ, కొత్తపల్లె, ఈశ్వరమ్మకాలనీలో నాటుసారా విక్రయాలు జోరుగా ఉన్నాయని ఫిర్యాదు చేసినప్పటికీ ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నామమాత్రంగా చేస్తున్నారన్నారు. మరికొందరైతే పట్టుబడిన నాటుసారా విక్రేతల నుంచి లంచాలు తీసుకుని కేసులు నమోదుచేయకుండా వదిలేస్తున్నారని ఆరోపించారు. మండల సమావేశానికి ఎక్సైజ్, ఎస్ఈబీ అధికారుల గైర్హాజరుపై కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నోటీసులు ఇవ్వాలని కోరారు. సీటీఎం పంచాయతీలో 41మంది లబ్ధిదారులకు జగనన్న ఇళ్లకు స్థలాలు చూపించి, ఇప్పటివరకు పట్టాలు మంజూరు చేయలేదని, ఆన్‌లైన్‌లో పట్టాలు చూపిస్తున్నప్పటికీ పట్టాలు ఇవ్వకపోవడంపై చర్యలు తీసుకోవాలని డీటీ రాజేష్‌ను కోరారు. అనంతరం సమావేశంలో భాగంగా వివిధ ప్రభుత్వశాఖల అధికారులు తమ ఆధ్వర్యంలో అందిస్తున్న పథకాలపై సభ్యులకు తెలిపారు. ఎంపీపీ రెడ్డెమ్మ మాట్లాడుతూ...ఇకపై జరిగే మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు తప్పక హాజరుకావాలని, కిందిస్థాయి సిబ్బందిని పంపితే తప్పక చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీడీఓ భానుప్రసాద్, వైస్ ఎంపీపీలు డిష్‌రమణ, నందిని తాజ్, సింగిల్‌విండో అధ్యక్షులు దండుకృష్ణారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

వినియోగదారుల ఫోరంతో సామాన్యుడికి న్యాయం

కలకడ : వస్తువులు కొనుగోలుపై విధిగా రసీదు తీసుకోవాడం వలన ఎవ్వరూ నష్ట పోకుండా వినియోగదారుల ఫోరంతో సామాన్యుడికి కూడా న్యాయం జరుగుతుందని రాష్ట్ర కన్జ్యూమర్‌ఫామ్ ప్రొటెక్షన్ రాయలసీమ జోన్ ఇంచార్జ్ దర్బార్‌బాషా అన్నారు. శనివారం మండలంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ అనిత ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏపీసీఆర్‌పీఎఫ్‌పై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలన్నారు. ఎక్స్‌ఫర్‌డేట్ చూసి తీసుకోవాలని, కొనుగోలు చేసే ప్రతి వస్తువులు నాణ్యతను పరిక్షించుకోవాలని సూచించారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ నరసింహులు

నిమ్మనపల్లె : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ నరసింహులు అన్నారు. శనివారం స్థానిక మండలపరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ నరసింహులు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు వివిధ శాఖల త్రైమాసిక ప్రగతి నివేదికను సమావేశంలో చదివి వినిపించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, అమలవుతున్న సంక్షేమపథకాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ...అధికార యంత్రాంగం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు దక్కేలా అధికారులు పనిచేయాలని సూచించారు. పథకాల లబ్ధిని ప్రజలకు చేర్చి, ప్రభుత్వ పనితీరుకు ప్రజల మద్దతు లభించేలా చూడాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, ఇతర సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాల అమలులో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యులు చేయాలన్నారు. జగనన్న హౌసింగ్ లబ్ధిదారులకు బిల్లులు వెంటనే మంజూరు చేసి నిర్మాణపనులు వేగంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూరీసర్వేలో అవకతవకలు జరిగాయని, ఒకరి రికార్డులు మరొకరికి పాస్‌పుస్తకాల్లో ముద్రించారని తవళం గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు ఎంపీపీ నరసింహులు, తహసీల్దార్ మంజుల దృష్టికి తీసుకువచ్చారు. భూరీసర్వేలో రైతుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మండలంలో నాటుసారా తయారీ, విక్రయాలు అధికంగా ఉన్నాయని, పోలీసు, ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశానికి హాజరుకాని ఆర్‌అండ్‌బీ, సెరికల్చర్, సోషల్‌వెల్ఫేర్, ఎక్సైజ్, ఆర్డీఏ, ఆర్టీసీ అధికారులకు చార్జ్‌మెమోలను జారీచేస్తున్నట్లు ఎంపీడీఓ శేషగిరిరావు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జయప్రకాష్‌రెడ్డి, సుజాత, కోఆప్షన్ సభ్యులు మహమ్మద్‌రఫీ, రమణారెడ్డి, తహసీల్దార్ సి.ఆర్.మంజుల, ఈఓపీఆర్డీ చలపతిరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వీడి మెరుగైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కుసుమకుమారి

రామసముద్రం: మండల సచివాలయ అధికారులు తమ విధులు పట్ల నిర్లక్ష్యం వీడి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీపీ కుసుమకుమారి , జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి , సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి, వైస్ ఎంపీపీ రమణారెడ్డి తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కుసుమకుమారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాఖలవారిగా అధికారులు అభివృద్ధి కార్యక్రమాలు చదివి వినిపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరేలా చూడాలన్నారు. వేరుశనగ ప్రత్యామ్నాయంగా ఉలవలు 206 క్వింటాలు ఆర్‌బికె ద్వారా పంపిణీ చేశామన్నారు. అలాగే హౌసింగ్ 2355 ఇల్లు మంజూరు అయ్యాయన్నారు. విద్యాశాఖ అధికారులు పాఠశాలలను పర్యవేక్షణ చేసి విద్యార్థులకు ప్రభుత్వం అందించే పథకాలు అందేలా చూడాలన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయి.. వాటిని పరిష్కరించాలన్నారు. ఉపాధిహామిలో రైతులకు మామిడి మొక్కలు , అల్లినేరుడు , మునగ, జామ మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. సమావేశంలో సీడీపీఓ సుజాత, ఎంపీడీఓ నారాయణస్వామి, డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాసరావు, ఈవో ఆర్డీ చంద్రశేఖర్‌రెడ్డి, ఏవోలు మోహన్‌కుమార్, మస్తాన్, గణేష్,ఏ పీవో గౌరిశంకర్, ఏపీఎం సుబ్రమణ్యం, ఎంఈవో హేమలత, ఫారెస్ట్ అధికారి చిట్టిబాబు, మండల స్థాయి పంచాయతీ కార్యదర్శులు , అధికారులు పాల్గొన్నారు.



ఉచిత టీకాలు

కలకడ : చిన్నారులకు ప్రభుత్వం అందించే వ్యాధినిరోధక టీకాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని గొళ్ళపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యసేవలు అందించారు. వర్షాకాలంలో వచ్చే జబ్బులు, నివారణ ఉపాయాలను తెలియజేశారు. 36 మందికి పరీక్షలు నిర్వహించారు. అనంతరం పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీహెచ్ ఈఓ జయరామయ్య, ఆరోగ్య సిబ్బంది వరలక్ష్మి, రమణమ్మ, శివకుమార్, రెడ్డెమ్మ, సులోచన, రోజ, రమేష్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సంకల్పయాత్రలో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

మదనపల్లె : బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ భానుప్రసాద్ అన్నారు. శనివారం వికసిత్ భారత్ సంకల్పయాత్రల రథం మండలంలోని బొమ్మనచెరువుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎంపీటీసీ ఎం.రామచంద్ర, ఎంపీడీఓ, ఈఓఆర్డీ వెంకటసుబ్బయ్య, సెక్రటరీ పద్మకుమారి తదితరులు ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో భాగంగా... ప్రధాని నరేంద్రమోదీ భారతదేశాన్ని 2047 సంవత్సరానికి ప్రపంచంలోనే అగ్రగామిగా నిలపాలనే ఉద్దేశంతో ప్రజలకు ఇచ్చిన సందేశాన్ని చదివి వినిపించారు. ప్రజలందరితో సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. అధికారులు తమతమ శాఖల ద్వారా కేంద్రప్రభుత్వం ప్రజలకు ఏ విధంగా సౌకర్యాలు కల్పిస్తోందనే విషయాన్ని ప్రజలకు వివరించారు. ఉజ్వల పథకంలో భాగంగా మహిళకు గ్యాస్ స్టవ్‌ను పంపిణీ చేశారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా ఐసీడీయస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన న్యూట్రిషన్‌స్టాల్, వైద్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఆయుష్మాన్‌భారత్ కార్డులను పంపిణీ చేశారు. సతత్ కృషి ఆక్టివిటీలో భాగంగా వ్యవసాయంలో డ్రోన్‌స్ప్రే వినియోగాన్ని రైతులకు డెమో ప్రదర్శన నిర్వహించారు. మై భారత్ వలంటీర్ రిజిస్ట్రేషన్స్‌లో భాగంగా యువతను రిజిస్ట్రేషన్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పోతుపేట, బుర్లపల్లి గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహనలో భాగంగా శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఆర్థిక అక్షరాశ్యత, మా సంకల్పం–అభివృద్ధి చెందిన భారత దేశం కార్యక్రమాన్ని డిస్‌ప్లే ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. మండల స్థాయి అధికారులు కేంద్రం, రాష్ట్రం భాగస్వామ్యంతో అమలవుతున్న పథకాల గురించి వివరించారు. నాయకులు మహమూద్, శివన్న, డ్రిప్ రమణ, సుబ్బిరెడ్డి, మోహన్‌రెడ్డి, మల్లెం శివయ్య, గోపాల్‌రెడ్డి, శంకర్‌మూర్తి, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

